ఈ రోడ్డు.. యమడేంజర్!

- జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో ప్రమాదకరంగా లింకు రోడ్డు
- నిర్వహణ లేకపోవడంతో గుంతలమయం
- ఫుట్‌పాత్‌పై పిచ్చిమొక్కలు పెరగడంతో పాదచారులకు ఇబ్బందులు
- కంకరతేలిన రోడ్డుపై అవస్థలు పడుతున్న వాహనదారులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): 'కోట్లు పెట్టి అందమైన రోడ్లను నిర్మిస్తున్నాం.. డివైడర్లను ఏర్పాటు చేస్తున్నాం.. హైమాస్ట్ లైట్లతో వాహనదారులకు చీకటిలో కూడా వెలుగుదారిని చూపిస్తున్నాం..' అని గొప్పలు చెబుతున్న అధికారులకు క్షేత్రస్థాయి సమస్యలు కనిపించడం లేదు. ఏదో రోడ్లు వేశామంటే వేశామన్నట్లుగా హడావుడిగా పనులు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. కాగా, చేపట్టిన పనులు ప్రారంభమైన తర్వాత వాటి నిర్వహణను కనీసం పట్టించుకునే నాథుడే కరువవుతున్నాడు. ఫలితంగా ఇటు బస్తీల్లోనూ, అటు కాలనీల్లోనూ, ప్రధాన మార్గాల్లోనూ.. ఏ రోడ్డు చూసినా అత్యంత దయనీయంగా కనిపిస్తున్నాయి. అధ్వానంగా ఉన్న రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఇందుకు జూబ్లీహిల్స్ ప్రాంతంలోని పలు రహదారుల నిర్వహణలోపమే నిదర్శనంగా నిలుస్తోంది.


రోడ్డు పక్కన నిర్మించిన ఫుట్‌పాత్‌పై పిచ్చిమొక్కలు, గడ్డి

జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్ రోడ్డు నెంబర్.70 నుంచి న్యాయవిహార్‌ను కలుపుతూ రాయదుర్గం వెళ్లే రోడ్డుకి లింకు రోడ్డును గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 4 వరుసలతో ఏర్పాటు చేశారు. దారి మధ్యలో డివైడర్‌ను, రెండు వైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. అయితే, జూబ్లీహిల్స్ నుంచి రాయదుర్గం, షేక్‌పేట, గచ్చిబౌలి ఓఆర్ఆర్ వైపు వెళ్లే వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉన్న ఈ లింకు రోడ్డు కొన్నిరోజుల నుంచి అధ్వానంగా మారింది. రోడ్డుపై పలుచోట్ల గుంతలు పడడంతోపాటు వర్షాలు కురిసిన సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకువచ్చిన మట్టి, ఇసుక, కంకర, ఇతర వ్యర్థాలతో అస్తవ్యస్తంగా తయారైంది. ఇదిలా ఉండగా, న్యాయవిహార్ వైపు నుంచి రోడ్ నెంబర్.70 వైపు వచ్చే రోడ్డుపై ఏర్పాటు చేసిన బారీకేడ్ రహదారికి అడ్డంగా మారింది. బైక్‌లతోపాటు కార్లలో ప్రయాణించే వారికి ప్రమాదకరంగా మారింది. ఎత్తయిన రోడ్డు నుంచి కిందకు వచ్చే క్రమంలో వాహనాలు బారీకేడ్‌ను ఢీకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతోపాటు ఈ ప్రాంతంలో రోడ్డు వంపు తిరిగి కుడిచేయి మలుపు తీసుకోవాల్సి వస్తుండడంతో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.


జూబ్లీహిల్స్ న్యాయవిహార్ నుంచి రోడ్డు నెంబర్.70ని కలుపుతూ నిర్మించిన లింకు రోడ్డులో ఏర్పాటు చేసిన బారీకేడ్, పేరుకుపోయిన మట్టి, కంకర


లింక్ రోడ్డులో ఏర్పడిన గుంతలు

ఫుట్‌పాత్‌పై పిచ్చిమొక్కలు..!

ప్రశాసన్‌నగర్‌లో రోడ్డు పరిస్థితి ఇలా అధ్వానంగా ఉంటే దాని పక్కనే నిర్మించిన ఫుట్‌పాత్ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. వాహనాలకు ఎదురువెళ్లకుండా రోడ్డుపక్కన పాదాచారులు హాయిగా నడుచుకుంటూ వెళ్లేందుకు అనుకూలంగా ఉండాల్సిన ఫుట్‌పాత్‌పై చెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో దానిపై నడవలేని పరిస్థితి నెలకొంది. కాగా, ఫుట్‌పాత్ అపరిశుభ్రంగా ఉండి దానిపై నడిచే పరిస్థితి లేకపోవడంతో పాదచారులు తప్పనిసరి పరిస్థితిలో రోడ్డుపై నుంచి నడవాల్సి వస్తోంది. ఈ క్రమంలో వెనకాల నుంచి వాహనాలు వేగంగా దూసుకొస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పాదచారులు తెలిపారు. ఇక్కడ రోడ్డు మలుపు తిరిగి ఉన్న ప్రాంతం కావడంతోపాటు అక్కడే ఉన్న బారీకేడ్‌తో పాదాచారులు రోడ్డు మీదకు వస్తున్న సమయంలో వెనక నుంచి వాహనాలు ఢీకొనే ప్రమాదం పొంచి ఉంది. ఇదిలా ఉండగా, రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతులు చేయించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతోన్నాయి. ఇందుకు ఫుట్‌పాత్‌పై ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గుబురు ఉన్న గడ్డే నిదర్శనం. జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో రోడ్డు నెంబర్.70ని కలుపుతూ నిర్మించి లింకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

భారీ వర్షం

- రోడ్లపై నిలిచిన వరద
- ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు


శ్రీనగర్‌కాలనీ ప్రధాన దారిలో పొంగుతున్న డ్రైనేజీ


కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద నిలిచిన వరదనీరు


బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.5లో వరద నీటిలో ఆగిన ద్విచక్ర వాహనం

బంజారాహిల్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం నగర వాసులను ఇబ్బందులకు గురిచేసింది. సోమవారం మధ్యాహ్నం తర్వాత రెండు గంటల పాటు కురిసిన వర్షం కారణంగా రోడ్లపై భారీగా వరద నీరు నిలిచింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ లాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2 పంజాగుట్ట శ్మశాన వాటిక వద్ద మోకాలి లోతు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ స్వయంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో పాటు మ్యాన్‌హోళ్ల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించారు.




బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.2లో శ్మశాన వాటిక వద్ద మోకాలి లోతు నీరు నిలవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

తప్పని ఇక్కట్లు..

ఖైరతాబాద్: భారీ వర్షానికి జనాలకు ఇబ్బందులు తప్పలేదు. మింట్ కాంపౌండ్, పాఠ్యపుస్తక ముద్రణాలయం ఎదురుగా, టెలిఫోన్ భవన్, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ల వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సచివాలయం సమీపంలో ప్రధాన రహదారి వద్ద నీరు నిలవడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ఖైరతాబాద్ మారుతీనగర్, ఓల్డ్ సీబీీ క్వార్టర్స్ వాసులు భారీ వర్షం పడడంతో ఆందోళనకు గురయ్యారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


బేగంపేటలోని శ్రీ కట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారు


సనత్‌నగర్‌లోని శ్రీ హనుమాన్ ఆలయంలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో దుర్గాదేవి


బోరబండ స్వరాజ్ నగర్ హరిహర క్షేత్రంలో శ్రీ బాలా త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా పసుపు రంగులో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు భారీగా కుంకుమార్చన నిర్వహించి దైవ భక్తిని చాటుకున్నారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఉదయం 3 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేసి బాలా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.
బంజారాహిల్స్/బేగంపేట/అమీర్‌పేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి)


బాలాత్రిపుర సుందరిదేవీ అలంకరణలో అమీర్‌పేట సోనాబాయి అమ్మవారు


అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


ఫిలింనగర్ ఎమ్మార్పీ కాలనీలో పూజల్లో పాల్గొన్న 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు తదితరులు


బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న సినీ నటుడు బాలకృష్ణ సతీమణి వసుందర


ప్రత్యేక అలంకరణలో శ్రీనగర్‌కాలనీ భ్రమరాంబ అమ్మవారు

పికెల్‌బాల్‌లో షట్లర్ శ్రీకాంత్ ఎంట్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ పికెల్‌బాల్ లీగ్ (హెచ్‌పీఎల్)లోని నంది చార్జర్స్ ఫ్రాంఛైజీలో బ్యాడ్మింటన్ వరల్డ్ మాజీ నెంబర్ వన్, స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ వాటదారుడిగా చేరాడు. నంది చార్జర్స్‌తో చేతులు కలిపినందుకు సంతోషంగా ఉందని, ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పికెల్‌బాల్‌ను తెలంగాణలోనూ వ్యాప్తి చేయడానికి తన వంతు కృషి చేస్తానని శ్రీకాంత్ చెప్పాడు. వచ్చే నెల 10వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే ఈ లీగ్‌లో మొత్తం ఎనిమిది జట్లు తలపడనున్నాయి.



జెర్సీ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్


క్రీడాకారులతో నవీన్ యాదవ్

త్రోబాల్ క్రీడాకారులకు కిట్లు పంపిణీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్టును ప్రకటించారు. అమ్మాయిల జట్టుకు నేహాన్షిక, అబ్బాయిల జట్టుకు యువన్‌రెడ్డి కెప్టెన్లగా నియమితులయ్యారు. యూసుఫ్‌గూడలోని తన కార్యాలయంలో రాష్ట్ర త్రోబాల్ సంఘం అధ్యక్షుడు నవీన్ యాదవ్ ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. గురువారం నుంచి ఈ పోటీలు బెంగళూరులో జరగనున్నాయి.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

బంజారాహిల్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో స్వచ్ఛంద సంస్థలు చేసిన సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఫిలింనగర్ ఫిలింఛాంబర్‌లో సోమవారం నటుడు కాదంబరి కిరణ్ స్థాపించిన మనం సైతం ఫౌండేషన్ 12వ వ్యవస్థాపన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ పరిశ్రమలో అనేక మంది ఆర్థికంగా ఇబ్బంది పడుతూ అనారోగ్యం బారిన పడ్డారని, ఇలాంటి వారిని ఆర్థికంగా మనం సైతం ఆదుకోవడం మంచి పరిణామమన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ, సమాజంలో ఒకరికొకరు తోడైతేనే మనుగడ ఉంటుందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ మూర్తి, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అశోక్ కుమార్, సురేష్ కొండేటి, రాఘవ, సాంబశివరావు, డీవీ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

బహిరంగ మూత్ర విసర్జన వద్దన్నందుకు దాడి

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మూత్ర విసర్జన వద్దన్నందుకు వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ, ప్రగతినగర్, ప్లాట్ నెంబర్.403కి చెందిన బి.దుర్గావిఘ్నేష్ ఇంటి సమీపంలో ప్రేమ్, పవన్, సోను, నాని బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు. గమనించిన దుర్గావిఘ్నేష్ మూత్ర విసర్జన చేయొద్దని మందలించినందుకు ఇరువురు కలిసి అతడిపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తలకు బలమైన గాయం కావడంతో పాటు మణికట్టు మోచేతిలో తిరిగింది. బంగారు గొలుసు కూడ పోయిందని సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలు పెంచాలని నిరసన

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరక్టరేట్ కార్యాలయం వద్ద టీయూసీఐ అనుబంధ అసోసియేషన్ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ బైఠాయించారు ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, ఎం.సుధాకర్ మాట్లాడుతూ తమకు ఏపీ కంటే వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని, వెంటనే పని భారానికి తగ్గట్లుగా కనీసం రూ.26 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ భద్రతతోపాటు ఆరోగ్య భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అరుణ, హేమలత, అరుణ్ కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాన్ టీచింగ్ వర్కర్లు



ముఖ్య నాయకులతో సమావేశమైన కిషన్‌రెడ్డి, దీపక్‌రెడ్డి

కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తూ బీజేపీ బలోపేతానికి తోడ్పాటును అందించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సన్నాహక సమావేశం నాగార్జుననగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ చేస్తున్న అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. బీజేపీ అనూహ్యంగా తెలంగాణలో పుంజుకుందని ఇందుకు పార్లమెంట్ ఎన్నికలే నిదర్శనమని పేర్కొన్నారు. ఉప ఎన్నికలో పార్టీని విజయతీరాలకు చేర్చాలని సూచించారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి, నాయకులు గౌతమ్‌రావు, మోహన్‌రావు పాల్గొన్నారు.


ఆస్తులు సేకరించాల్సిన వారితో సమావేశమైన జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అధికారులు

వేగంగా కేబీఆర్ పార్కు అభివృద్ధి పనులు

ఖైరతాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కును అభివృద్ధి చేస్తుండడంతో కొన్ని ప్రైవేట్ ఆస్తులను సేకరించాల్సి వస్తోంది. అక్కడి జంక్షన్ అభివృద్ధి కోసం అవసరమైన స్థల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేయగా, సోమవారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో మొదట సమావేశమయ్యారు. ఇందులో కేబీఆర్ పార్కు అభివృద్ధి ఎలా చేయాలి, దానికోసం ఎన్ని ఆస్తులు సేకరించాలి, వాటికి పరిహారం తదితరాలపై చర్చించారు. అనంతరం ఆస్తులు కోల్పోతున్న యజమానులను కార్యాలయానికి పిలిపించారు. అనురాగ్ జయంతి జూబ్లీహిల్స్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి స్థల యజమానుల అనుమానాలను నివృత్తి చేశారు. పార్కు అభివృద్ధికి అందరూ సహకరించాలని అధికారులు కోరారు.


కేక్ కట్ చేసిన నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

నిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలు

నిమ్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. ప్రపంచ క్రానిక్ మైలాయిడ్ ల్యూకేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో సోమవారం రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు మాట్లాడుతూ ఈ వ్యాధి పట్ల సమాజంలోని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ రచన మాట్లాడుతూ వైద్యులు ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా రోగులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతవీర్, డా.మెహెర్ లక్ష్మి, డా.ఉప్పలపాటి శ్రీహరి, మాక్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


సినీ స్టూడియోస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమాణ స్వీకారంలో అనిల్, చిన్న శ్రీశైలంయాదవ్, ఈశ్వర్‌రావు, వీరేశం, ఉపేందర్

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ శాఖ నుంచి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సినీ స్టూడియోస్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు అందేలా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీరేశం, కోశాధికారి ఆర్.పెద్దఉపేందర్ చూడాలని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ సూచించారు. వెంకటగిరిలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన పదవీ స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ కార్డు ఉన్న ప్రతీ కార్మికుడికి పని దొరికేలా కృషి చేయాలన్నారు. చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించే యూనియన్ కార్యాలయానికి రూ. 5లక్షలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ మాజీ నాయకులు వైకుంఠరావు, విజయ్ కుమార్, సభ్యులు జగన్, సుదర్శన్, నటరాజ్, రాజు, ఆనంద్, గణేశ్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్య

దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

- కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లో దశల వారీగా అభివృద్ధి పనులు ప్రారంభించి వాటిని పూర్తి చేస్తామని స్థానిక కార్పొరేటర్ దేదీప్య అన్నారు. వెంగళరావునగర్-మధురానగర్ కాలనీ మధ్య సీసీ రోడ్డు పనులను ఆయా కాలనీల సంక్షేమ సమితి ప్రతినిధులతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మధురానగర్ సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, వెంగళరావునగర్ కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ఈ.నర్సింగరావు, సాయిరఘు, బీఆర్ఎస్ నాయకులు పవన్ ముదిరాజ్, పూజారి బాలు, ఆదిత్య, బాలు రజక,కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న గాంధీ ఆస్పత్రి డాక్టర్లు

బోయినపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు ఒకటో వార్డులోని బోయినపల్లి ప్లే గ్రౌండ్ వద్ద ఉన్న డిస్పెన్సరీలో గాంధీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బోయినపల్లి ప్రాంతానికి చెందినవారే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజలు కూడా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. గుండె, షుగర్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్లు రోగులకు సూచనలు చేశారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్నవారికి గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయడానికి స్లాట్‌లను ఇచ్చారు. అంతేకాకుండా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రోజా, అశోక్, పద్మ కాంత్, సాయి, ప్రీతి, సులోచన, సుష్మ తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

వరద బాధితులను ఆదుకోవాలి

అడ్డగుట్ట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అడ్డగుట్టలోని మారేడుపల్లిలోని రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఐ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రాంతాల్లో ఆస్తినష్టం జరిగిందని, దీంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి నష్టపోయిన కుటుంబాలకు రూ.25వేలు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా పూర్తిగా నష్టపోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి ఎమ్మార్వో రాజు నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సికింద్రాబాద్ నియోజకవర్గం సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, గౌరి నాగరాజు, పాకాల యాదగిరి సయ్యద్ గౌస్, లెనిన్, కొండల్, యాదగిరి, రవికాంత్, శ్రీనివాస్, ఖలీల్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు


బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్

సమస్యల పరిష్కారానికి కృషి

చిలకలగూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ హమాల్‌బస్తీలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ సోమవారం పర్యటించారు. చెత్తను సరిగా తొలగించటం లేదని, తక్కువ ప్రెజర్‌తో తాగునీరు వస్తోందని, అప్రకటిత విద్యుత్ కోత వంటి సమస్యలను బస్తీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతానని, బస్తీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు, బస్తీవాసులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైళ్లపై రాళ్లతో దాడి చేస్తే కఠిన చర్యలు

- ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన


రైల్వే గేటు వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైళ్లు వెళుతున్న సమయంలో రాళ్లతో దాడి చేస్తే రైల్వే యాక్టు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన సూచించారు. సోమవారం నాంపల్లి ప్రాంతంలోని రైల్వే గేటు వద్ద ప్రజలకు ప్లకార్డుల ద్వారా అవగాహన కల్పించారు. నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కరపత్రాలు పంచుతూ రైల్వే భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కల్పన మాట్లాడుతూ రైల్వే గేటు పడితే గేటు తెరవకముందే వాహనాలు వెళ్లేందుకు ప్రయత్నించకూడదని ప్రమాదాలు జరుగుతాయని సూచించారు. రైళ్లలో ప్రయాణ సమయంలో మీకు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే 139 నంబరుకు సమాచారం ఇస్తే క్షణాల్లో మీ ముందు ఉండి సమస్య పరిష్కరిస్తామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొంది. దీంతో అతడు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గుండ్లపోచంపల్లి ప్రాంతంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నారాయణ కేతావత్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్‌కు చెందిన గుండ్లపోచంపల్లి ప్రాంతంలో అద్దెకు ఉంటూ స్థానికంగా ఒక ఫ్యాక్టరీలో వారం రోజుల క్రితం పనిలోకి చేరాడు. ఆదివారం గుండ్లపోచంపల్లి రైల్వే పట్టాల సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. డిప్యూటీ స్టేషన్ మాస్టర్ వెంటనే జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న శైలజా రామయ్యర్


కడక్‌పురలోని సిద్ధిదాత్రి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న జంపన ప్రతాప్ తదితరులు


బాలాత్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు


కనకదుర్గ ఆలయంలో పోటెత్తిన భక్తులు

లష్కర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

సికింద్రాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెల్లవారుజాము నుంచే లష్కర్‌లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహాకాళి దేవాలయం భక్తులతో కళకళలాడింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, అమ్మవారికి పూజలు చేసి అంతా శుభం చేకూర్చాలంటూ మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఆలయంలో జరిగే శరన్నవరాత్రోత్సవాలు, దైవభక్తి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్ జ్యోతి వెలిగించి, ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ట్రస్టీ రామేశ్వర్ పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో..

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో పలు ఆలయాల్లో సోమవారం దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కొట్ట ధరణీధర్, ప్రధానార్చకులు శ్రీనివాసపంతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధురానగర్‌కాలనీలో బంగారు మైసమ్మ ఆలయంలో దేవీ నవరాత్రులను ఆలయచైర్మన్ గుర్రం పవన్ కుమార్‌గౌడ్ ప్రారంభించారు. మేడిబావి పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో చైర్మన్ పరికిబండి కళాప్రకాశ్ ఆధ్వర్యంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలను చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయం, చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

నేతాజీనగర్ సవరాలబస్తీలో జైభజరంగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల మొదటి రోజు స్థానిక బస్తీ నాయకుడు పోగర్తి శంకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బోయినపల్లిలో..

దసరా శరన్నవరాత్రులు ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. సోమవారం నుండి దసరా పండుగ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు బోయినపల్లిలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బోయినపల్లి బాపూజీనగర్ లోని దేవి నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, కడక్‌పురలోని సిద్దిదాత్రి ఆలయంలో మొదటి రోజు బాల త్రిపుర సుందరి అమ్మవారి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ వేడుకలకు జంపన ప్రతాప్ తమ కుటుంబసభ్యులతో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాల అర్చకులు తీర్థ ప్రసాదం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాస్, శశి, బిట్టు, శ్రీను, శ్రావణ్ కుమార్, ఉన్ని కృష్ణన్, ప్రేమ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మారేడుపల్లిలో..

పికెట్‌లోని భూ లక్ష్మమ్మదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అక్టోబరు 2 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు జెట్టి ఉమామహేశ్వరరావు తెలిపారు. 22న బాలా త్రిపుర సుందరి దేవి, 23న లలిత త్రిపుర సుందరి దేవి, 24న అన్నపూర్ణదేవి, 25న లలిత త్రిపుర సుందరి దేవి, 26న మహా చండిదేవి, 27న మహాలక్ష్మీదేవి, 28న మహా గౌరీదేవి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుర మర్థినిదేవి, 2న భూలక్ష్మమ్మ దేవి అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ నిర్వాహక కమిటీ పేర్కొంది.


బాలాత్రిపుర సుందరిదేవి అలంకరణలో భూలక్ష్మమ్మ అమ్మవారు

మౌలిక సదుపాయాలకు పెద్దపీట : ఎమ్మెల్యే


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం బొల్లారం డౌటన్ బజార్‌లో రూ.97 లక్షల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గంగపుత్ర సంఘం కార్యాలయం నుంచి బొల్లారం లాన్స్ నాయక్ రాంచందర్ రావు విగ్రహం వరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే రోడ్డు ఏళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురి అయిందని రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం తరువాత ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాకపోకలు సులువుగా జరుగవచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులను మరిన్ని వెచ్చించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ కదీరవన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలరాజు, రామ్, శ్రీనివాస్, ప్రేమ్, హయత్, శరత్, బీజేపీ సీనియర్ నాయకులు భానుక మల్లికార్జున్, ధనంజయ చారి, కిరణ్ ముదిరాజ్, శ్రీకాంత్, బీజేపీ వార్డు అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

సికింద్రాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్, డిఫెన్స్ ఎస్టేట్ అధికారి దినేష్‌రెడ్డిలకు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారితో సోమవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమై, ఆయా అంశాలపై చర్చించారు. కంటోన్మెంట్ వాణిలో వచ్చిన ప్రజా సమస్యలు, విన్నపాలను పరిశీలించి, వాటిని త్వరగా పరిష్కరించాలని వారిని కోరారు. కాగా క్రిస్టియన్ సిమెట్రీ అంశమై డిఫెన్స్ ఎస్టేట్ అధికారితో మాట్లాడారు. కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, వాటర్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు తేలుకుంట సతీష్‌గుప్తా పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపం బతుకమ్మ : కావ్యరెడ్డి


అశోక్‌నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, బీజేపీ నాయకురాలు మేకల కీర్తి

బౌద్ధనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపం బతుకమ్మ వేడుకలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి అన్నారు. బౌద్ధనగర్ డివిజన్ న్యూఅశోక్‌నగర్‌లో బీజేపీ నాయకురాలు మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కావ్యరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మలను ఆడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బీజేపీ నాయకులు హన్మంతు, రాజుసాగర్, ప్రకాశ్‌గౌడ్, శ్రీనివాస్, నాగరాణి, కరుణ, శోభారాణి, మౌనికరెడ్డి, సౌజన్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

బతుకమ్మ పండుగ తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటేవిధంగా ప్రారంభమయ్యాయి. బాపూజీనగర్, నేతాజీనగర్, నందమూరినగర్, జయనగర్ కాలనీలతో పాటు, పలు ప్రాంతాలలో సంబరాలు కన్నుల పండుగగా సాగింది. అయితే ఒక్కసారిగా కురిసిన భారీ వర్షాన్ని కూడా లెక్కచేయని మహిళలు వర్షంలోనే కొనసాగించగా, కొన్నిచోట్ల అపార్టుమెంట్ల కింద మహిళలు ఆడిపాడారు. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మను నెత్తిన పెట్టుకుని రావడంతో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నీటి కొలనులో బతుకమ్మలను నిమజ్జనం చేసి ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నేరేడ్‌మెట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చంద్రగిరి కాలనీలో నివాసముండే సుకుమారన్(62) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం ఇంట్లోనే ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకొని ఆత్యహత్య చేసుకొన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సందీప్‌కుమార్ తెలిపారు.


సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సమక్షంలో కేకును కట్ చేసిన కార్పొరేటర్ సామల హేమ

ఘనంగా కార్పొరేటర్ పుట్టినరోజు వేడుకలు

బౌద్ధనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నామాలగుండులో తన నివాసంలో అభిమానులు, కార్యకర్తల మధ్య సామల హేమ కేకును కట్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ సమక్షంలో కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అండదండలతో రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా గెలిపించిన సీతాఫల్‌మండి డివిజన్ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని, డివిజన్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్లు కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మీ, నాయకులు కరాటేరాజు, రాజు సుందరం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ముస్తాబైన శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

బౌద్ధనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 48వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు 24 నుంచి అక్టోబరు 2 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్, ధర్మకర్తమండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావులు తెలిపారు. 25న తిరుప్పావడ సేవ, 27న వేదస్వస్తి ముత్యపు కవచాలంకరణ, 28 పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబరు 2న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, శ్రీవారి అవరాత్సోవం, 108 కలశాభిషేకం, విజయదశమి పురస్కరించుకుని స్వరదర్శనం, శమీపూజలతో పాటు ప్రతిరోజు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 25న శేషవాహన, 26న హంసవాహన, 27న హనుమంత వాహన, 28న గరుడ వాహన, 29న సింహవాహన, 30న గజ వాహన, అక్టోబరు1వ తేదీన అశ్వ వాహన సేవలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



సికింద్రాబాద్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సువర్ణ సోమవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డిని తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి


మల్లారెడ్డి గార్డెన్ సీఎంఆర్ పాఠశాల వైపునకు వెళ్లే రహదారిలో మురుగు, చెత్త

దుర్గంధంగా బోయినపల్లి రోడ్డు

బోయినపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయినపల్లి మల్లారెడ్డి గార్డెన్ సీఎంఆర్ పాఠశాల వైపునకు వెళ్లే ప్రధాన రహదారి ప్రాంతాలు అధ్వానంగా తయారై ఇక్కడ ఏ మూలన చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో కూరగాయల ప్యాకింగ్ కేంద్రం, పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. దీంతో వ్యాపారస్తులు చెత్తను ఇక్కడే వేస్తున్నారు. దీంతో భరించరాని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పల వద్దకు కుక్కలు, పందులు చేరి చెల్లాచెదురు చేస్తుండటంతో పరిసరాలన్ని అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్త మూలంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో ఎక్కడ అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలుతాయోనని ప్రజలు భీతిల్లుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- మూతలు లేని ఫ్యూజ్ బాక్సులు
- పక్కనే ఉన్న చెత్త కుప్పలు
- వేలాడుతున్న వైర్లు


పాన్‌బజార్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త


ఆర్పీరోడ్డు హిందీ విద్యాలయ వద్ద ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్


పాన్ బజార్‌లోని మహంకాళి దేవాలయం వద్ద మూతలు లేని ఫ్యూజ్ బాక్సులు

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అలసత్వం వల్ల రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డివిజన్‌లోని డిస్టిలరీ రోడ్డు, హైదర్‌బస్తీ, కళాసీగూడ, ఓల్డ్ ఘాస్మండి తదితర ప్రాంతాల్లో నివాసాల మధ్య, రహదారులకు అనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రహరీలు, రక్షణ లేక ప్రమాదకరంగా మారాయి. వాటి వద్ద చెత్త పేరుకుపోవడంతో దీనితో అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో తీవ్ర విమర్శలకు దారి తీస్తుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రహరీలు కూలిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కొందరు స్థానికులు చెత్తా చెదారం వేస్తున్నారు.


డంపింగ్ యార్డులను తలపిస్తూ

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. ఒక సారి బిగించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోగా, మరికొన్ని చెత్త డంపింగ్ యార్డులుగా మారాయి. రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలో ఇలా ఎన్నో ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న విద్యుత్ తీగలు సైతం గాలికి వేలాడుతూ ప్రమాద ఘటికలు మోగిస్తున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన దిమ్మెలు ధ్వంసమై ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.

మూతలు లేని ఫ్యూజ్ బాక్సులు

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్సులు నిర్వహణ లోపంతో ప్రమాదకరంగా మారాయి. మృత్యు ద్వారాలు తెరుచుకుని ఉన్నట్లు వాటి మూతలు తెరుచుకుని ఉంటాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త నిండి ఉండడంతో వాటి సమీపంలోకి ఆవులు, కుక్కలు ఆహారం కోసం వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి.

చెత్త వేయకండి



ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ప్రమాదం జరిగాక బాధపడడం కంటే ముందు జాగ్రత్త తీసుకుంటే మంచిది. విద్యుత్‌శాఖ ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లను పర్యవేక్షిస్తుంటాలి. ఏమైనా సమస్యలు ఉంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది.

- కాసం రవి కుమార్, ఏఈ, జనరల్ బజార్

భద్రత కరువు

ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు వాటి నిర్వహణ, భద్రతను పూర్తిగా గాలికి వదిలేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రహరీల నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.